క్లుప్తంగా

ఉన్నతంగా రాణించాలి


ప్రసంగిస్తున్న డీఎస్పీ రమణారావు

చిత్తూరు కలెక్టరేట్ : ప్రస్తుతం ఉన్న టెక్నాలజీని అందిపుచ్చుకుని ఉన్నత విద్యలో రాణించాలని ఇంటెలిజెన్స్ డీఎస్పీ రమణారావు అన్నారు. నగరంలోని మిట్టూరులో ఉన్న ప్రైవేటు డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. దీనికి డీఎస్పీతోపాటు ఏపీ ఎస్పీడీసీఎల్ రిటైర్డ్ ఏఓ యర్రయ్య విద్యార్థుల కు మార్గనిర్దేశం చేశారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో కరస్పాండెంట్ జగన్నాథరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సకాలంలో వైద్యసేవలు

గుడిపాల: ప్రతి గ్రామంలో సకాలంలో వైద్యసేవలు అందిస్తున్నామని డాక్టర్ సంధ్య అన్నారు. ఆమె శనివారం మండలంలోని పెద్దిశెట్టిపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఆమె వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా మంచం పట్టిన రోగుల ఇంటి వద్దకే వెళ్లి వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. 66 మందికి చికిత్స చేశారు. వైద్య సిబ్బంది తేజ, ఇందుమతి, చంద్రశేఖర్, నిరోషా పాల్గొన్నారు.

రక్తహీనత నివారణకు చర్యలు

తవణంపల్లె: గర్భిణులకు రక్తహీనత రాకుండా జాగ్రత్తలు పాటించాలని వైద్యాధికారి మోహన్ వేలు గర్భిణులకు సూచించారు. మండలంలోని ఈచనేరిలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వైద్య శిబిరంలో డాక్టర్ 37 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి సూచనలు, సలహాలు ఇచ్చారు.

ఆరోగ్య పరిరక్షణ అవసరం

ఐరాల: ప్రతి ఒక్కరికీ ఆరోగ్య పరిరక్షణ అవసరమని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండలంలోని కట్టకిందపల్లెలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో 75 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, చిన్న పిల్లలకు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. మంచానికే పరిమితమైన రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని సూచనలు, సలహాలు ఇచ్చారు. అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లల ఎత్తు, బరువు, హెచ్‌బీ పరీక్షలు చేసి రికార్డులు పరిశీలించారు. హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

నయాబ్ ఖాజీగా సయ్యద్ ఇమ్రాన్



చిత్తూరు కలెక్టరేట్: నియోజకవర్గ ప్రభుత్వ నయాబ్ ఖాజీగా సయ్యద్ ఇమ్రాన్ నియమితులయ్యారు. ఈ మేరకు చిత్తూరు రెవెన్యూ డివిజన్ ప్రభుత్వ ఖాజీ మీర్జా అలీ అక్బర్ ప్రకటించారు. నియమితులైన సయ్యద్ ఇమ్రాన్ మాట్లాడుతూ ముస్లింల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. పలు ముస్లిం సంఘాలు ఆయనకు అభినందనలు తెలిపారు.

వైద్యుల నిరసన జ్వాల

- ఆస్పత్రుల్లో సేవలు నిలిపివేసిన వైనం
- రోడ్డెక్కిన ప్రభుత్వ, ప్రైవేటు వైద్యులు


బంగారుపాళెం: నిందితులను శిక్షించాలంటూ ర్యాలీ చేస్తున్న డాక్టర్లు, వైద్య సిబ్బంది

బంగారుపాళెం: కోల్‌కతాలో ప్రభుత్వ వైద్యురాలిపై హత్యాచారం హేయమైన చర్య అని బంగారుపాళెం సామాజిక ప్రభుత్వ ఆసుపత్రి ప్రధాన వైద్యాధికారి డాక్టర్ శిరీష అన్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కోల్‌కతాలోని ఆర్‌జీ కార్ ప్రభుత్వ వైద్యశాల జూనియర్ వైద్యురాలి హత్యాచార ఘటనపై ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పిలుపు మేరకు శనివారం మండల కేంద్రంలో సీహెచ్‌సీ డాక్టర్లు, వైద్య సిబ్బంది 24 గంటలపాటు విధులు బహిష్కరించారు. నల్లబ్యాడ్జీలు ధరించి ధర్నా చేశారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి నుంచి ప్లకార్డులు చేతపట్టుకుని నినాదాలు చేస్తూ జాతీయ రహదారి మీదుగా నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. నాలుగు రోడ్ల కూడలి వద్ద చెన్నై–బెంగళూరు జాతీయ రహదారిపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. డాక్టర్లు మాట్లాడుతూ, ప్రతి ఏడాది మహిళలపై లైంగికదాడులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నిందితులను పట్టుకుని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం జూనియర్ డాక్టర్ మృతికి కొవ్వొత్తులను వెలిగించి నివాళులర్పించారు. కార్యక్రమంలో డాక్టర్లు జ్యోతిస్వరూప్, విజయకుమారి, శాలిని, అఖిల్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యులపై దాడులు దుర్మార్గం

ఐరాల: దేశ వ్యాప్తంగా వైద్యులపై దాడులు, హత్యయత్నాలు అధికమవుతున్నాయని, భవిష్యత్తులో ఇలాంటి దాడులు జరగకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠినమైన చట్టాలు తీసుకురావాలని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత అన్నారు. స్థానిక పీహెచ్‌సీ వద్ద ఆమె వైద్య సిబ్బందితో కలిసి నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ జీవకళ, హెల్త్ సూపర్‌వైజర్ చిన్నమ్మ, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

బొమ్మసముద్రంలో వైద్యుల నిరసన

గుడిపాల: మండలంలోని బొమ్మసముద్రం ప్రాథమిక వైద్యాధికారి రష్మిత ఆధ్వర్యంలో సిబ్బంది ఆస్పత్రి ఎదురుగా నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఓ భానుప్రకాష్, సాప్ నర్స్ సరస్వతి, సిబ్బంది నిరసన తెలియజేశారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

చిత్తూరు కలెక్టరేట్: కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్ ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ సంఘం నాయకులు, సావిత్రమ్మ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు శనివారం సాయంత్రం కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో సావిత్రమ్మ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులు, ఏఐఎస్ఎఫ్ నాయకులు బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

పి.కొత్తకోట సీహెచ్‌సీలో నిరసన

పూతలపట్టు: మండలంలోని పి.కొత్తకోట సీహెచ్‌సీ నుంచి పురవీధుల్లో వైద్యవిద్యార్థులు ర్యాలీ చేసి నిరసన తెలిపారు. ఇందులో వైద్యాధికారులు కుమార్‌రాజా, తేజ, నర్మద హెడ్ నర్సు లీలా, వైద్య శాఖా సిబ్బంది పాల్గొన్నారు.





గుడిపాల: నిరసన తెలియజేస్తున్న వైద్యసిబ్బంది, ఐరాల: పీహెచ్‌సీ వద్ద నిరసన తెలుపుతున్న వైద్యులు, చిత్తూరు: నిరసన తెలుపుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు, పూతలపట్టు: ర్యాలీలో పి.కొత్తకోట వైద్యాధికారులు

కాణిపాకం ఎస్ఐగా ధరణీధర



కాణిపాకం: కాణిపాకం ఎస్ఐగా శనివారం ధరణీధర బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఈయన ఇంటెలిజెన్స్‌లో పనిచేశారు. బదిలీపై ఇక్కడకు రాగా, ఈ స్థానంలో పనిచేస్తున్న రామ్మోహన్ గుడిపాల పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయ్యారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఆయనమాట్లాడుతూ, కాణిపాక పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూస్తామన్నారు. నిఘా వ్యవస్థను పెంచి ప్రజలకు, ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందిలేకుండా చూస్తామన్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణ

తవణంపల్లె: మండలంలోని క్లస్టర్ కేంద్రాల్లో ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహించినట్లు ఎంఈఓలు హేమలత, త్యాగరాజురెడ్డి తెలిపారు. స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు ఎలా నిర్వహించాలో, విద్యార్థులకు సులభమైన పద్ధతిలో బోధన చేయాలని పలు విషయాలపై ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్లు మునస్వామి, రమేష్ పాల్గొన్నారు.

రేపటి నుంచి కార్యదర్శులకు శిక్షణ

తవణంపల్లె: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 19వ తేదీ నుంచి 21వ తేదీ వరకు మండలంలోని సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు, డిజిటల్ అసిస్టెంట్లకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ అబ్దుల్‌కలాం ఆజాద్, ఈఓపీఆర్‌డీ కుమార్ తెలిపారు. శిక్షణ కార్యక్రమానికి సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు తప్పక పాల్గొనాలని కోరారు.

ఐకమత్యమే యూనియన్ బలం

చిత్తూరు కలెక్టరేట్ : పాత్రికేయులు ఐకమత్యంగా ఉండడమే యూనియన్‌కు బలమని, జిల్లాలో పాత్రికేయుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ అన్నారు. ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (ఏపీయూడబ్ల్యూజే) 67వ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. ఏపీయూడబ్ల్యూజే, చిత్తూరు ప్రెస్‌క్లబ్ సంయుక్తంగా కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్ చేతుల మీదుగా కేక్ కట్ చేయించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ దశాబ్దాల చరిత్ర ఉన్న ఏపీయూడబ్ల్యూజే నాయకుల పోరాటాలు మరవలేనివన్నారు. కలెక్టర్‌కు యూనియన్ నాయకులు మొక్కను అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా కన్వీనర్, చిత్తూరు ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు లోకనాథన్, ప్రెస్‌క్లబ్ సెక్రటరీ అశోక్‌కుమార్, ఉపాధ్యక్షుడు మహేశ్, సంయుక్త కార్యదర్శి షకీల్, కోశాధికారి పవన్, సీనియర్ జర్నలిస్టులు పాల్గొన్నారు.

దోమ లార్వాలపై డ్రోన్లతో దాడి


డ్రోన్‌తో మందు పిచికారీ పరిశీలిస్తున్న కమిషనర్

చిత్తూరు అర్బన్: దోమల వృద్ధిని నియంత్రించడానికి అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని, నీటి కుంటల్లో దోమ లార్వాలను నాశనం చేయడానికి డ్రోన్లతో మందును పిచికారి చేస్తున్నట్లు చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ జె.అరుణ చెప్పారు. నగరంలోని బాలాజీ కాలనీ, ఓబనపల్లి ప్రాంతాల్లో శనివారం నీటి కుంటలు, నీటి నిల్వ ప్రాంతాల్లో డ్రోన్ల సాయంతో వెక్టోబాక్ బయోలాజికల్ ఇన్‌సెక్టిసైడ్ మందును పిచికారీ చేశారు. మనుషులు వెళ్లలేని నీటి కుంటలు, నిల్వ నీటి ప్రాంతాల్లో డ్రోన్ల సాయంతో మందును పిచికారీ చేస్తున్నామన్నారు. నిల్వ నీటిలోని దోమ లార్వాలను నాశనం చేయడం ద్వారా దోమల పెరుగుదలను నియంత్రించవచ్చన్నారు. అధికారులు గుర్తించిన దోమల వృద్ధి ఎక్కువగా ఉన్న 8 బ్లాక్ స్పాట్ ప్రాంతాల్లో డ్రోన్ల సాయంతో దోమ లార్వాల నియంత్రణకు మందులను పిచికారీ చేస్తున్నామన్నారు. ప్రతి 15 రోజులకోసారి ఈ ప్రక్రియను కొనసాగించనున్నట్లు కమిషనర్ తెలిపారు. కమిషనర్ వెంట ప్రజారోగ్యశాఖ అధికారి డా.అనిల్ కుమార్ నాయక్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిన్నయ్య, మలేరియా అసిస్టెంట్ మురళి ఉన్నారు.

నీటి కొళాయి సర్వే

నగరంలో జరుగుతున్న ఇంటింటికీ నీటి కొళాయి సర్వేను టెలిఫోన్ కాలనీ కమిషనర్ పరిశీలించారు. ప్రతి ఇంటికీ కొళాయి ద్వారా నీటిని అందించాలని ఉద్దేశంతో ప్రభుత్వం ఈ సర్వే నిర్వహిస్తుందని, క్షేత్రస్థాయిలో పక్కాగా నిర్వహించాలన్నారు. కార్యదర్శులు ప్రతి ఇంటికీ వెళ్లి కొళాయి కనెక్షన్ ఉందా లేదా? రికార్డుల్లో నమోదైనవి, నమోదు కానివి? రికార్డుల్లో నమోదయి ఉండి కనెక్షన్ లేనివి? నీరు ఏ సమయంలో సరఫరా అవుతుంది వంటి వివరాలు పక్కాగా నమోదు చేయాలన్నారు. ప్రతి ఇంటికీ శుభ్రమైన నీరు సరఫరా చేయాలనే లక్ష్యంతో చేస్తున్న ఈ సర్వేపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సర్వేను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ రమణ, స్థానిక ప్రజా ప్రతినిధులు, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

గ్రామీణులు పరిశుద్ధ నీటినే తాగాలి


కిట్లను పంపిణీలో పాల్గొన్న ఎమ్మెల్యే మురళీమోహన్, డీఎంహెచ్‌ఓ ప్రభావతి

పూతలపట్టు: గ్రామాల్లో ప్రజలు శుద్ధమైన నీటిని మాత్రమే తాగాలని ఎమ్మెల్యే మురళీమోహన్ పిలుపునిచ్చారు. ఆయన శనివారం డీఎంహెచ్‌ఓ ప్రభావతితో కలిసి మండలంలోని దివ్యాంగులకు కిట్లను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైద్య సిబ్బంది గ్రామాల్లో వ్యాధిగ్రస్తులను గుర్తించి వారికి సేవలు అందించాలన్నారు. గ్రామాల్లో మంచినీరు అందకపోతే ఆ సమస్యను మా దృష్టికి తీసుకొస్తే వెంటనే స్పందించి ఆ గ్రామానికి ఆర్వో ప్లాంటును నిర్మిస్తా మని హామీ ఇచ్చారు. మండల ప్రజలు ప్రైవేటు ఆస్పత్రుల్లో వెళ్లి వేలకు వేలు ఖర్చుపెట్టడం కంటే ప్రభుత్వ ఆస్పత్రులను ఆశ్రయించడం ఎంతోమేలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారులు కిరణ్ నాయక్, ప్రవీణా, సీహెచ్‌ఓ శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు.

ప్రజలకు సేవ చేయడమే లక్ష్యం

తవణంపల్లె: అధికార యంత్రాంగం ప్రజాప్రతినిధులతో కలిసి ప్రజలకు సేవ చేయడమే లక్ష్యంగా పనిచేయాలని ఎమ్మెల్యే మురళిమోహన్ ఆదేశించారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల సాధారణ సమావేశం ఎంపీపీ ప్రతాప్‌సుందర్ రాయల్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాల్గొని ప్రసంగించారు. ప్రజాప్రతినిధులను అధికారులు గౌరవించి వారు ప్రతిపాదించిన పనులను, సమస్యలు పరిష్కరించాలని చెప్పారు. గ్రామాల్లో తాగు నీరు కలుషితం కాకుండా జ్వరాలు, అంటువ్యాధులు ప్రబలకుండా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, పంచాయతీ, వైద్యాధికారులు పని చేయాలని ఆదేశాలిచ్చారు. మండలంలో రెవెన్యూ సమస్యలు అధికంగా ఉన్నాయని వాటిని పరిష్కరించాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. ఎంపీపీ మాట్లాడుతూ మండలాభివృద్ధికి ఎమ్మెల్యే సహకరించాలని కోరారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు భారతి, ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్, తహసీల్దార్ సుధాకర్, ఎంఈఓ హేమలత, ఏఓ ప్రవీణ్, డాక్టర్ ప్రియాంక, ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

కలసికట్టుగా పనిచేయాలి

బంగారుపాళెం: ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు కలసి కట్టుగా పనిచేయాలని ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు. స్థానిక ఎంపీడీఓ సమావేశ భవనంలో శనివారం మధ్యాహ్నం ఎంపీపీ అమరావతి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఆయా శాఖలకు సంబంధించిన అంశాలపై చర్చించారు. ఆయన మాట్లాడుతూ, ప్రజా సమస్యలపై స్పందించి పరిష్కరించినప్పుడే ఫలితం ఉంటుందన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి, జెడ్పీటీసీ సోమశేఖర్, ఎంపీడీఓ శివ శంకర్, తహసీల్దార్ బాబురాజేంద్రప్రసాద్, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, గ్రామ కార్యదర్శులు, వీఆర్ఓలు పాల్గొన్నారు.

చెదిరిన పేదోడి సొంతింటి కల

- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చురుగ్గా ఇళ్ల నిర్మాణాలు
- రెండు నెలల నుంచి ముందుకు సాగని పనులు
- సొంతింటి కోసం నిరీక్షిస్తున్న లబ్ధిదారులు
- నియోజకవర్గంలో ఆగిపోయిన పక్కా గృహాల పనులు


వై.ఎస్.గేటులో ఆగిపోయిన ఇళ్ల నిర్మాణ పనులు

ఐరాల / తవణంపల్లె: పేదోడికి సొంతింటి కల నెరవేర్చాలన్న సంకల్పంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం మార్పు చెంది కూటమి ప్రభుత్వం రావడంతో పూతలపట్టు నియోజకవర్గంలోని తవణంపల్లె, ఐరాల, బంగారుపాళెం, యాదమరి, పూతలపట్టు మండలాల్లో పక్క గృహాల నిర్మాణ పనులు ఎక్కడికక్కడే ఆగిపోయాయి. నియోజకవర్గంలో సొంత ఇంటి కోసం లబ్ధిదారులు నిరీక్షిస్తున్నారు. కొత్త ప్రభుత్వం పక్క గృహాల నిర్మాణంపై అధికార యంత్రాంగానికి దిశా నిర్దేశం చేయకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఒక్కో లబ్ధిదారునికి పక్క ఇళ్ల నిర్మాణానికి రూ.2 లక్షలు మంజూరు చేస్తామని ఆర్భాటంగా హామీలు ఇచ్చి ఇప్పటి వరకు ఆ ఊసే ఎత్తకపోవడంతో లబ్ధిదారులు సొంతింటి కలపై భయాందోళనకు గురవుతున్నారు. అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాలు ఎప్పటికీ పూర్తి అవుతాయో అని ఆవేదన చెందుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హులందరికీ పార్టీలకతీతంగా న్యాయం చేశారు. అర్హత ఉంటే చాలు అడక్కుండానే ఇల్లు మంజూరైంది. ఎన్నో ఏళ్లగా పేదలు వేచి చూస్తున్న సొంతింటి కల నెరవేరే దిశగా గత ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జగనన్న కాలనీల పేరుతో ఊర్లే నిర్మించారు.

ఇబ్బందులు లేకుండా బిల్లులు

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నిర్మాణం చేపట్టిన ఇళ్లకు సంబంధించి బిల్లులు విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం సమయానికి అందించింది. బేస్‌మెంట్ మొదలు కొని అన్ని పనులు ముగిసిన వెంటనే బిల్లులను సమర్పించిన లబ్ధిదారుల ఖాతాలకు నగదు జమ చేసింది.

లబ్ధిదారులకు ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్


గత ప్రభుత్వంలో ఇంటి పట్టాలు మంజూరైన లబ్ధిదారులకు ప్రభుత్వ ఖర్చులతోనే ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్ చేయించి వారికి అందజేశారు. ఇంటి స్థలం వారికే సొంతం కావడంతో నాలుగేళ్ల తరువాత క్రయవిక్రయాలు చేసుకోవచ్చని అప్పటి ప్రభుత్వం నిర్దేశించింది. దీంతో లబ్ధిదారులు సొంతింటి కల నెరవేరడంతో పాటు సొంత హక్కు కలిగిందని సంతోష పడ్డారు. కానీ కూటమి ప్రభుత్వంలో పేదోడి సొంతింటి కల ఆవిరి అయింది.

లబ్ధిదారులకు భరోసా కరువు

కూటమి ప్రభుత్వంలో పక్కా గృహాల లబ్ధిదారులకు భరోసా కరువైంది. గత ప్రభుత్వం ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలు మంజూరు చేసింది. ఆర్థికంగా వెనుకబడిన లబ్ధిదారులకు గ్రామ సమాఖ్యల ద్వారా రుణాలు మంజూరు చేయించేలా చర్యలు చేపట్టింది. ఒక్కో లబ్ధిదారునికి ఇంటి నిర్మాణం పూర్తి చేసుకోవడానికి రూ.30 వేల నుంచి రూ.లక్ష వరకు ఆర్థికసాయం అందించారు. కూటమి ప్రభుత్వంలో పక్కా గృహాల నిర్మాణ పనులపై ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం ఆశ్చర్యంగా ఉంది.

సౌకర్యాలు కరువు

నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన లే అవుట్లలో కనీస వసతులు కరువయ్యాయి. కూటమి ప్రభుత్వంలో లేఔట్లలో విద్యుత్ దీపాలు లేక అంధకారం అలుముకుంది. వీధులు అపరిశుభ్రంగాను, డ్రైనేజీ కాలువలు, సీసీ రోడ్లు లేక తాగునీరు సక్రమంగా అందక అవస్థలు పడుతున్నారు. దీంతో ఇళ్ల నిర్మాణ పనులు ఆగిపోయాయి. లబ్ధిదారులు నిరాశ నిస్పృహల్లో కూరుకుపోయారు.


నయనంపల్లె కాలనీలో ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు

నియోజకవర్గ వ్యాప్తంగా ఇళ్ల నిర్మాణాలు ఇలా..

మండలం	మంజూరైన ఇళ్లు	పూర్తయిన ఇళ్లు
తవణంపల్లె	1687	1310
ఐరాల	2195	1543
బంగారుపాళెం	3269	2036
యాదమరి	1533	1091
పూతలపట్టు	1874	1271
మొత్తం	10,558	7,251